యెంకి ముఖం సిగ్గుతో కందిపోయింది. ఆమె కేక వేద్దామనుకొంటుండగానే గుఱ్ఱం గుడినుండి రెండు ఫర్లాంగులు పోయింది.

అశ్వ వేగానికి ముచ్చటపడిన యెంకికి ఆనందంతో నోట మాటరాలేదు. దొరచేతులమధ్య పొందికగా కూర్చొంది. హయం ఆయాసంతో కోటచేరింది. దొర యెంకిని ఎత్తుకొని కోటలోకి పోయాడు. దూరాన కోవెలముందు బాజాలు వారి వివాహవాద్యాలయినాయి. యెంకి కొండ రాణి ఐంది. అతడామెకు బానిస.

దొరకోట మట్టికోటైనా చాలా బలమైనది. ఎత్తైనది. కోటకు వెనకవైపున గోడనితాకుతూ కొండయేరొకటి పారుతోంది. దానివేగంచూసి దాన్ని చావు ఏరని పిలుస్తారు.

ఓరోజున రాణి కోటగోడమీద జామిపళ్ళు తింటోంది. ఆమె పళ్లు చిలకలాకొరకటం, ఆమెపళ్లు తళతళ మెరవటం దొర తమాషాగా పరికిస్తున్నాడు.

ఇంతలో పళ్ళబుట్ట యేరులోకి జారింది. అది రాణి స్వయంగా చేసినది. ఎంతో అందంగా ఉండేది. రాణి బిక్కమొహం వేసింది. ఆమె "నా బుట్ట"—అనకుండానే దొరయేరులోకి ఉరికాడు దానికోసం. దొర లోతుకుపోయాడు. రాణి "తనకోసం—"కదా అని కిలకిల నవ్వింది. దొర ఉరికినచోట నీరు వలయంగా తిరుగుతోంది. అది సుడిగుండం. రాణి గుండెలు కొట్టుకున్నాయి భయంతో. ఆ తరువాత ఆమె ఎవరికీ కనపడలేదు.

"ఆమె ఏమైంది?" నేను కుతూహలంతో అడిగాను. దొర అన్నాడు. "ఆమె చనిపోయింది. ఆ తొందరలో కాలుజారి ఏరులో పడిందంటారు" నేను చూస్తున్నాను. దొర అన్నాడు, "ఆ పళ్లబుట్ట ఆమె దొర చస్తాడని ఏరులోకి జారవిడిచింది అని చెప్పుకొంటారు. ఇప్పుడామెను 'వంచకి'అంటారు." నేనడిగాను. "నిజంగా ఆమె వంచకి కాదా?"

"కాదు. ఆమె ప్రేమదేవత. దొర తమాషాగా నీటిలో 20నిమిషాలు ఉండగలడు"అన్నాడు తాత.

"అయితే అతనేద్రోహి"అందామనుకుంటున్నా నేను. ఇంతలో ఆ ముసలితాత అన్నాడు, "నేనే ఆ కొండ దొరని. ఆమె ఉరకాలనిఉరికింది ఏరులోకి."

---

క థా ని క

# వి ల య వ ల యం

"వల్లపురెడ్డి"

"ప్రధాని నెహ్రూ తనకే పదవీ అక్కర్లేదన్నాట్ట నిన్న. ఎట్లాగూ పదవి లేదుగదా అని దేశ అభ్యున్నతికి ఆధారమైన విషయాలపట్లనైముఖ్యం వహించననీ, ప్రజాసేవద్వారా దేశ మాతకు చేయాల్సిన కైంకర్యంలో లోపం లేశమైనా రానీయననీ అన్నాట్ల" అని తన ఈడు వాడూ, పొరుగువాడూ అయిన ఎల్లయ్య ప్రక్కనే యున్న సుబ్బయ్యతో చెబుతూంటే విన్న రామిగాడి ఆశ్చర్యానికి అంతులేకపోయింది.

నెహ్రూ అంటే వాడికీ తెలుసు. స్వరాజ్యం వచ్చినపుడు గాంధీ, నెహ్రూ; పటేల్, సుభాస్ ఇత్యాది పేర్లన్నీ విన్నాడు. అందరికీ 'జై'లు కొడుతూ ఒకసారి —ఒకసారేమిటి, నూరుసార్లు— "పండిట్ నెహ్రూకీ జై"అన్నాడు. భారతదేశం, స్వరాజ్యం, కాంగ్రెసు, లాల్ ఖిల్లా లాంటి కొత్త కొత్త మాటలకు అర్థం కూడా ఆనాడే తెలుసుకున్నాడు. ఈ నాయకులపేర్లు, దేశం, దేశమాత, —భారతమాత—రాజ్యం మొదలయిన మాటలన్నీ ఆనాడు వాడికున్న లౌకిక జ్ఞాన భాండాగారంలోగాని, భాషా పరిజ్ఞానంలోగాని లేనేలేవు. ఈ పదప్రకరాలన్నీ వాని మస్తిష్కంలో మసక మసకగా మెఱిసి, అంతటితోనే ఆగిపోయి ఈనాటి వరకూ నిండుకాంతి నివ్వలేదు. వాటిని క్షుణ్ణంగా తెలిసికోవాలనే జిగీష వానికిలేకపోవటమే అందుకు ముఖ్య హేతువు.

అయినా, నెహ్రూ ఢిల్లీలో యుంటాడాయె! తెలిసినవాళ్ళు అప్పుడప్పు డనుకుంటూంటే ఈ విషయం వాని చెవిలో కొన్నిసార్లు అప్రయత్నంగా పడింది. ఢిల్లీలోయున్న నెహ్రూ అదేదో అన్నాడట, ఎల్లయ్యకు తెలిసిందట. ఇంట్లో నాలుగు

గోడల మధ్య జరుగుతున్న విషయాలే జ్ఞాపక ముండవు; తెలియవు. కాని—ఇంటి సంగతి, ఊరు సంగతి అసలే కాదు, జిల్లా అయినా కాదు. ఎక్కడో, అంచనావేయ గలుగనంత దూరాన యున్న ఢిల్లీలో సర్కారు ఉన్నమాట తనప్రక్కనే జీవిస్తూన్న ఎల్లయ్యకు తెలిసిందంటే రామిగాడికి ఆశ్చర్యం కలగటం అతిశయోక్తికాదు. పైపెచ్చు ఆమాట నెహ్రూ అతఃక్రితం రోజునే అన్నాడట. ఇది వాణ్ణి మరీ చకితుణ్ణి చేసింది.

కాని తన ఆశ్చర్యంలో అర్థమేమీ లేదని ఎల్లయ్యా సుబ్బయ్యల తరువాతిసంభాషణ విన్నాక తేలిపోయింది రామిగాడికి. ఎల్లయ్య చెప్పిందాన్ని విని సుబ్బయ్య "ఏం ఎవరన్నారు?"అని అడిగాడు.

"ఈరోజు పేపరుచూడలేదాఏంటి?"అని ప్రశ్నిస్తూనే తనచేతిలోయున్న పేపరును అతనికిచ్చాడు.

"లేదురా. ఈరోజు ప్రొద్దుట్నుంచీ తీరిక చిక్కలా. ఇప్పుడే చదవా లనుకుంటున్నా"అని సమాధానం చెబుతూ పేపరు చేతికి తీసుకు ఏదో చదువుకున్నాడు. పేజీలు తిరగవేశాడు కొన్సేపు, తరువాత ఏదో ఆ విషయమయ్యే—నెహ్రూ పదవి నుండి విరమణపొందితే దేశానికి వాటిల్లే కష్టారిష్టాలనుగూర్చి—ఏమోమాట్లాడుకున్నారు. వాళ్లసంభాషణకు పర్యవసానం ఏంతేలిందో ఏమో!రామిగాడు అంత వరకక్కడే నిరీక్షించలేక పోయాడు. తనకు తెలియని దూరపు వార్తను అంతత్వరగా ఎల్లయ్యకు తెలిపిన పేపరునుగూర్చి ఆలోచించు కుంటూ ఇంటికి వెళ్ళిపోయాడు.

ఢిల్లీ! ఎంత దూరానుందో? ఏదో నిత్య వాక్కుల్లో ఎవరినైనా పట్టుకోవాల్సి వచ్చినపుడు "నిన్ను ఢిల్లీకి పోయినా విడువను" అని అనటంవల్ల, తల్లీకొడుకుల పవిత్ర సంబంధాన్ని, ఆత్మీయతను ఉద్ఘాటం చేప్పుడు "ఢిల్లీకి రాజైనా, తల్లికి కొడుకే" అనే సామెత ప్రయోగం జరిగినప్పుడుగాని విన్నమాటే. ఈ మాటలవల్ల ఢిల్లీ చాలా దూరముందనిన్నీ, మహాగొప్ప పట్టణమనిన్నీ బోధపడింది. అంతేగాని ఆ పట్టణవిషయాలేమీ తెలీవు. అంత దూరాన—అంటే తన ఊహాకందనంతటి దూరానయుండే ఢిల్లీలో నిన్నజరిగిన వార్త ఈనాడే ఎల్లయ్యదాకా ప్రాకివచ్చిందంటే ఆ పేపరే కారణం. తానూ చదివినవాడైయుంటేనో!

రామిగానికి తన తెలివితక్కువతనం అప్పుడు గుర్తుకొచ్చింది. తనుగూడా చదువుకుని యుంటే ఆ సమాచారాలన్నీ తెలుసుకుని వాళ్ళతో ప్రాపంచిక వ్యవహారాల్ని గూర్చి గడియసేపు ప్రసంగించే వాడేకదూ! కాని తన మందబుద్ధి అంత దూరం వెళ్ళలేక పోయింది.

ఒక సంవత్సరం క్రితం ఆ వాడలో వయోజన పాఠశాల ఒకటి వెలసింది. పెక్కురు చదువుకున్న వాళ్ళువచ్చి, విద్యాప్రాధాన్యంను గూర్చి ఎంతో చెప్పి అందరినీ బలవంత పరిచారు విద్యాభ్యాసం చేయమని, ఆనాటి నుండే ఆ వాడ నడివీథిలో యున్న వేపచెట్టుక్రింది వేదిక దగ్గర కొందరు రాత్రిళ్లువచ్చి, అక్షరాభ్యాసం చేయించి పోవటం ప్రారంభించారు. విద్యావశ్యకతను కాస్తోకూస్తో తెలుసుకున్న వారందరూవచ్చి నేర్చుకోసాగారు. కొందరు తమకు చదువే అక్కరలేదనుకున్నారు. వాళ్ళ జాబితాలోనే రామిగాడూ చేరిపోయాడు! తను, తన భార్య, యజమాని, సేవ, ఉదరపోషణ. ఇవి తప్పితే వానికానాడు మరేమీ గొప్పలుగా కన్పించలేదు. అంతలోనే, ఆ విధుల్ని నిర్వర్తిస్తేనే తనకు జన్మసాఫల్యతని అనుకున్నాడు. అందరూ "రోజు కష్టించే సమయంలో ఇదీ ఒకటి" అని రాత్రిళ్ళు విద్యనేర్చుకుంటూంటే రామిగాడు "పగలంతా పాటుపడి రాత్రిపూటయినా సరిగ్గా విశ్రాంతి తీసికోక పోవటం బుద్ధితక్కువతనం" అనే మతాలో చేరిపోయాడు.

ఇప్పుడు మాత్రం వాని ఊహల్లో గొప్ప మార్పువచ్చింది. ఎట్లాగైనాసరే, తానూ చదువు నేర్చుకోవాలనుకున్నాడు. అందరిలోనూ అన్ని విషయాల్ని గూర్చి ముద్దుగా ముచ్చటించుకుంటూ గౌరవాన్ని పొందాలనే ఆకాంక్ష ఎక్కువయింది. ఆనాడే భార్యను ఒత్తిడి పరచాడు తనతోబాటు విద్యాభ్యాసానికి రమ్మని.

రామిగాడు మొన్న మొన్ననే లచ్చిని పెళ్ళి చేసుకున్నాడు. చాలా అందమైన పిల్ల. వాడలోని వాళ్ళంతా అబ్బుర పడిపోయారు ఆపిల్ల తమ కులంలో పుట్టదగ్గది కాదనీ, ఏ గొప్ప వంశాల్లోనో జన్మమెత్తాల్సియుండిందనీ. అంత అందమైన భార్యకు భర్తయి తాను తోటివారితోబాటు చదువు నేర్చుకోకపోవటం ఏమీ బాగనిపించలేదు.

చదువు నేర్చుకోటానికి రమ్మని భర్త ఇచ్చిన సలహాను ఆమె మొట్టమొదట నిరాకరించింది. అయినా, భర్త బలవంతాన ఒప్పుకోక తప్పలేదు.

* * *

రామిగాడూ, లచ్చి ఇరువురూ విద్యాభ్యాసం చేస్తున్నారు. రోజూ చదువు చెప్పటానికి వచ్చే పంతుళ్ళు పలకలపై రాసియిచ్చిన అక్షరాల్ని బొటనవ్రేలి మందంగా దిద్దటమూ నేర్చుకోవటమూను. ఇది వారి దినచర్యల్లో ఒకటైపోయింది. క్రమంగా పుస్తకాల్ని పట్టారు. అప్పుడప్పుడు ఇద్దరూ కలిసి వార్తాపత్రికలోని వార్తల్ని చదవటానికి ప్రయత్నించేవారు. కొంచెంకొంచెం అవగాహన మవుతూంటే ఇక ముమ్ముందు పెద్ద చదువులుగూడా చదవొచ్చనుకున్నారు.

విద్యాబోధనకై వచ్చే గురువులు సుశిక్షితులు కనుక వాళ్ళకు అక్షరాలు నేర్పటం, పాతపాఠాలు విని క్రొత్తపాఠాలు చెప్పిపోవటమే కాకండా ఒకొక్కనాడు దేశానికీ మనుష్యులకు యున్న సంబంధాన్ని తెలియజేస్తుంటారు. ఇంకోనాడు ప్రాపంచిక వ్యవహారాలను వివరిస్తారు. మరోనాడు సృష్టివైచిత్ర్యాన్ని స్పష్టీకరిస్తారు. వేరోనాడు విజ్ఞాన పరిశోధనలో పురోగమనం, వాటివలన కలిగిన ఫలితాలు—కనిపెట్టబడిన చిత్ర విచిత్ర యంత్రాలు — మొదలయినవాటినిగూర్చి ఉపన్యసిస్తారు. వయోజన విద్య నభ్యసించటానికి వచ్చే వాళ్ళ వయస్సు అంతవరకే మించిపోయి యుండటంవల్ల చదువుతోబాటే ఇలాంటి లౌకిక విషయ పరిజ్ఞానం ఆదిలోనే కలిగించటానికి ప్రయత్నిస్తూంటారు. తాము రోజు రోజూ తెలుసుకుంటూన్న కొత్తకొత్త సమాచారాల్ని అప్పుడప్పుడు ప్రసక్తికి తెచ్చుకుంటారు వాళ్ళు. ఇన్నాళ్ళు తమకు తెలియకుండా ప్రపంచంలో దాగియున్న చిత్రాతిచిత్రాల్ని మనస్సులో మననం చేసుకుని ఆశ్చర్యపోతారు.

అంతవరకు సూర్యుడు తూర్పునపుట్టి పడమర అస్తమిస్తున్నాడనుకొనేవారు. ఇప్పుడు భూమి తన చుట్టుతాను తిరుగుతూ సూర్యబింబానికి ప్రదక్షిణం చేస్తుందని తెలుసుకున్నారు. సూర్యచంద్రులిరువురూ అన్నదమ్ములనీ, తల్లి శాపం పెట్టడంవల్ల సూర్యుడికి వేడి, చంద్రునికి చల్లదనము ఆవరించినట్లు కథలద్వారా తృప్తిపడేవాళ్లు ఈనాడా మాటల్ని సుతరామూ నమ్మరు. చంద్రునికి స్వతః కాంతి ఏమిలేదని, చంద్రగోళంపై పడిన సూర్యకిరణ పరావర్తనవల్లనే మనకు వెన్నెల లభిస్తుందని తెలుసుకున్నారు. ప్రతిసంవత్సరమూ సంభవించే సూర్య చంద్ర గ్రహణాలకు కారణం రాహువు కాదని అతఃక్రితం ఎవరేనాఅంటే ఉన్నపళంగా నోరుమూయించేవాళ్లు కాని సూర్యునిచుట్టూ పరిభ్రమించే భూమి, చంద్రగ్రహాలే అందుకు కారణమని ఇతరులకూడాచెప్పప్రయత్నిస్తారిప్పుడు. ఇంతేకాదు, వారికి కలిగిన లౌకికపరిజ్ఞానం ఏయే దేశాలకు ఎవకెవరు ముఖ్యులుగా ఉన్నారోకూడా కొంచెం కొంచెం తెలుసు.

వాళ్లలో కలిగిన మార్పునుగూర్చి ఇంకా వ్రాయకండా ఒక్కముక్కలో తేల్చాలంటే విజ్ఞాన పరిశోధనల మూలంగా కనిపెట్టబడిన విషయాల్ని మునుపటిలా మూర్ఖత్వంతో ఒప్పుకోక పోవటమనేది మాసిపోయింది. కారణ సహితములయిన విషయాల్ని ఒప్పుకుంటారు. ప్రపంచంలో అనుదినమూ జరుగుతూన్న పరిశోధనలన్నీ మానవజీవిత నిర్మాణానికి సోపానాలనీ, వాటి నధిరోహిస్తూ తాము స్వర్గద్వారందాకా పోవచ్చనీ తీయని కలలు కంటున్నారు.

రామిగాని గుడిసెలో రెండుగదులే యున్నాయి. లోపలిగదిలో లచ్చి వంటచేస్తూ రాత్రిఇచ్చిన పాఠాన్ని వల్లిస్తూయుంది పుస్తకం ముందెట్టుకుని. ఇవతలి గదిలో రామిగాడు కూర్చుని ఆమె చదువుతూన్న పాఠాన్ని వింటున్నాడు. విజ్ఞానంద్వారా ముమ్మందు కలుగబోయే మార్పునుగూర్చి స్వప్నలోకంలో పడిపోయాడు.

విజ్ఞానంవల్ల ఇంతవరకు పరిశుద్ధత, సభ్యత అంటే ఏమిటో తెలిసివచ్చాయి. కొంచెం నలుగురిలో మాట్లాడగలిగి తనకూ కాస్త తెలుసునని పించుకుంటున్నాడు.

వైజ్ఞానికులు చంద్రలోకానికి బాటలు వేస్తున్నారట. ఆ బాటలు కాస్తా పూర్తిఅయితే ఇక తనూ తనప్రేయసి —లచ్చి— కలిసి నేరుగా చంద్రగోళంచేరి అక్కడే హాయిగా వెన్నెలతీపియలూగవచ్చు. సంసారంలో క్షుద్రసౌఖ్యాల్ని కాలరాచి అమరభోగ మనుభవించవచ్చు. ఆనాడిక వాళ్లను ఆజ్ఞాపించటానికి హక్కు ఎవరికీయుండదు.

ఇంతవరకు ఒక్కడే సూర్యుడున్నాడనుకున్నాడు. మొన్న పెద్దమేష్టారుచెప్పిన ఉపన్యాసంలో విజ్ఞాన శాస్త్రజ్ఞుల పరిశోధనల ఫలితంగా ఎన్నోసూర్యులున్నాయని విశదమయింది. అవింకా దూరంగా ఉన్నాయట; అందుకే మనకగుపట్టం లేదట. అయితే ఏనాటికయినా దగ్గరగా చేరుతాయి, మనకు అగుపడ్తాయని చెప్పారు. అవును. నిజంగానే అవి దగ్గరగావస్తే ఎంతబావుంటుంది? ఒక సూర్యుడ్ని తెచ్చి తమ ఇంట్లో దీపంగా పెట్టుకోవచ్చు. ప్రతిరోజూ కిరసనాయిలు లేక పడ్తూన్న తంటా తీరిపోతోంది. వంటచేయటానిక్కూడా అడవికెళ్ళి రోజూ కట్టెలు కొట్టుకురావాలి. సూర్యుడి వేడిమితోనే వంట తయారుచేసే యంత్రాలు కనిపెట్టారట. మరేమీ పరవాలేదు. ఆ యంత్రాన్నొకదాన్ని తెచ్చుపెట్టుకుంటే ఇంతశ్రమపడాల్సిన అక్కరేలేదు. ఇక తనబ్రతుకు స్వర్గమే. ఆ స్వర్గానికి తను దేవుడు; తన లచ్చి దేవేరి. ఆహా! ఎంతబావుంది? ఎక్కడా లోకం? ఎప్పుడు, ఎప్పుడు?

ఈ ఆలోచనల్లో తాను రచిస్తూన్న కల్పనా సృష్టిలో "హాహాహాహా హాహాహా" అని ఎక్కడో ఒక వికటాట్టహాసం ధ్వనించింది. ఏమిటది, అని ఆశ్చర్యపోయి చూసేసరికి భయంకరంగా నవ్వుతున్నాడొక వైజ్ఞాని. రామిగాడికి భయం వేసింది. చెమ్మటలు క్రమ్మినయి మెయినిండా.

పరిశోధనల 'జిగీషలో లోకాన్ని స్వర్గంగా మార్చబోయి నరకంగా రూపొందిస్తున్నారు. వైతరణి సృష్టిస్తున్నారు. అమృతాన్ని పిండాల్సిన అణువులోంచి మారణాస్త్రాలను తయారుచేస్తున్నారు. ఆటంబాంబు! అంతకంటే మించింది హైడ్రోజను బాంబు. ఇంకాఎన్నో. ఒక బాంబు ప్రయోగిస్తే కోట్లజనం మాడిపోతారట. సస్యశ్యామలాలుగా యుండే ప్రదేశాలు వల్లకాడులవుతాయట. బాంబుల ఫలితంగా నాశనమయిన హిరోషిమాను వర్ణించిచెప్పిన మేష్టారు మాటలింకా చెవుల్లో గుసగుసలు పెడ్తున్నాయి. ఈ అణుశస్త్రాల బిట్టుతోనే ప్రపంచయుద్ధాన్ని లేవదీయ ప్రయత్నించే అగ్రరాజ్యముఠాల అహమహమిక చాలా నీచంగా తోచింది. ఇదంతా తలచుకుంటే విజ్ఞానం లేకపోయినా బావుండే దనిపించిది. ఆలోచనా వేగమతిశయించింది.

ఇంతవరకు ఆలోచించిందంతా లోకానికి సంభవించే విపత్తు. కాని తీరాచూస్తే ఈ వైజ్ఞానికులు తన జీవితానికే చిచ్చుబెడుతూన్నట్లుంది. అవును.

వానిభార్య అందంగా యుంది. తనకు అనుకూలవతి. అన్యోన్య దాంపత్యంకంటే మరేమి కావాలి దైనికజీవన భారాలను దించుకోటానికి? ఇంజెక్షన్ల ద్వారా పిల్లలు పుడుతారట. తనభార్యకు కేవలం సంతానాభిలాషే యుండేమో, ఎవరు చెప్పగలరు? ఇంజెక్షన్ల విషము ఈపల్లె వాతావరణంలోనూ సోకితే తనగతేంగాను? తనభార్య ఇక తనతో కాపురం చేస్తుందా!

పోనీ దాంపత్యం లేకపోతే లేకపోయింది. కనీసం ముఖాలయినా చూసుకుని తృప్తిపడవచ్చు. 'మనసు మనసూ గలిసి మనగలిగినాక దేహాల దాహాలు తీరకుంటేమి?' అని అన్నాడొక కవి. అలా అయినా జతగా బ్రతుకుదామంటే అదీ సాధ్యపడనట్లుంది.

అదుగో, పూర్వస్మృతిని కలిగించే యంత్రాన్ని గూడా కనిపెట్టారట. మెల్లిమెల్లిగా అది కూడా వస్తే? ఆ యంత్రంవలన తన అందమైన భార్యకు పూర్వజ్ఞానమవగతమైతే? పూర్వజన్మలో ఆమె ప్రియుడెవడో? ఆ ప్రియుణ్ణిచూస్తే? వాడు తనకంటే అందగాడైతే? అందగాడు కాకపోయినా పూర్వప్రియుడిని ఎడబాయలేకఆమెగూడా తన ప్రియుణ్ణి వెతుక్కుంటూ తన్నుకాలదన్నిపోతే? ఏమో! తన పూర్వజన్మ ప్రేయసి ఎలావుందో? తనకేమో ఈ భార్యను విడువాలని లేదు. ఇదే స్వర్గమనుకొని సౌఖ్యాల్లో తేలాలని ఉంది. కాని ఈ వైజ్ఞానికులు తనకే ద్రోహం చేస్తున్నారు. తన భవితవ్యాన్ని మిడిమంటల్లోకి త్రోసేస్తున్నారు.

రామగాని మెదడులో ఈ తలంపులన్నీ విలయాన్ని రేకెత్తించాయి. తల గిర్రునతిరిగిపోయింది పనిలోకి వెళ్లాల్సిన వేళయిందని తీయని కంఠంతో వచ్చి చెప్పినమాట విని రామిగాడు ఇహలోకంలో పడ్డాడు. భార్యను చూడ్డంతోనే ఏవేవో ఆలోచనలు కలిగినయి. భగవంతుడీ అరిష్టాలన్నీ తెచ్చిపెట్టకుండుగాక అని ప్రార్థించుకుంటూ యజమాని పనిలోకి వెళ్ళిపోయాడు. ★